సాక్షి
యాదాద్రి భువనగిరి

గురువారం । 15 । ఆగస్టు । 2024



పంద్రాగస్టుకు ముస్తాబు

స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా విద్యుత్ దీపాల అలంకరణలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్



న్యూస్‌రీల్

1,025 జాతీయ పతాకాల విక్రయం

భువనగిరి : స్వాతంత్య్ర దినోత్సవం రోజున ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగురవేయాలని కేంద్ర ప్రభుత్వం పిలుపునిచ్చిన నేపథ్యంలో జిల్లాలోని తపాలా కార్యాలయాల ద్వారా వారం రోజులుగా జాతీయ పతాకాలను విక్రయిస్తున్నారు. ఒక్కో జాతీయ జెండాను రూ.25 చొప్పున విక్రయిస్తున్నారు. బుధవారం సాయంత్రం వరకు 1,025 జాతీయ జెండాలు విక్రయించినట్లు పోస్టల్ అధికారులు తెలిపారు. అలాగే పలు స్వచ్ఛంద సంస్థలు తక్కువ ధరకు జాతీయ జెండాలను విక్రయించడంతో పాటు కొన్ని చోట్ల ఉచితంగా పంపిణీ చేశాయి. ప్రజల్లో దేశభక్తి పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు తెలిపారు.

అమరవీరులను స్మరించుకుందాం

భువనగిరి టౌన్ : జిల్లా కేంద్రంలోని కెనెరా బ్యాంకులో బుధవారం పార్టీషియన్ హర్రర్స్ రిమెంబరెన్స్ డే నిర్వహించారు. దేశ విభజన సమయంలో జరిగిన హింసాత్మక సంఘటనలను గుర్తుకు తెచ్చుకొని బాధితులను గౌరవించడానికి పార్టీషియన్ హర్రర్స్ రిమెంబరెన్స్ డే నిర్వహిస్తున్నట్లు జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ శివరామకృష్ణ తెలిపారు. అనంతరం స్వాతంత్య్రపోరాటంలో ప్రాణత్యాగం చేసిన వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 1947 నాటి హింసాత్మక ఘటనలు, బాధితుల ఫొటోలతో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వి.కృష్ణ, ఏపీజీవీబీ రీజినల్ మేనేజర్ శ్రీనివాస్, స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబ సభ్యులు కృష్ణదేవి పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారిగా బాధ్యతల స్వీకరణ



ఉపేందర్‌రెడ్డికి ఉత్తర్వుల కాపీ అందజేస్తున్న డీఆర్‌డీఓ నాగిరెడ్డి

భువనగిరిటౌన్ : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ విజిలెన్స్ ఆఫీసర్‌గా నియమితులైన మందడి ఉపేందర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పనుల్లో పారదర్శకత పాటించి నిధులు దుర్వినియోగం కాకుండా కృషి చేస్తానన్నారు. ఆయనను డీఆర్‌డీఓ నాగిరెడ్డి, టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు భగత్‌తో పాటు పలువురు ఉద్యోగులు సన్మానించారు.

రాజాపేట ఆస్పత్రి తనిఖీ



వైద్యసేవలపై డాక్టర్‌ను తెలుసుకుంటున్న అడిషనల్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ మనోహర్

రాజాపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని బుధవారం జిల్లా అడిషనల్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మనోహర్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రామకృష్ణ తనిఖీ చేశారు. ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశా రు. డాక్టర్‌కు, సిబ్బందికి సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వారి వెంట మండల వైద్యాధికారి శ్రవణ్‌కుమార్ ఉన్నారు.

మహాత్ముడి బాటలో 'గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ'


సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మహిళలు



వినోభా మందిరాన్ని సందర్శించిన గాంధీగ్లోబల్ ఫ్యామిలీ సభ్యులు

చౌటుప్పల్ : మహాత్ముడి ఆశయ సాధనలో భాగంగా చౌటుప్పల్‌లో పలువురు మహిళలు గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ట్రస్ట్‌లో చేరారు. గాంధీజీ ఆశయాలు, లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ట్రస్ట్ కమిటీలు పనిచేస్తున్నాయి. అయితే వాటిలో మహిళలతోపాటు పురుషులు కూడా ఉంటారు. కానీ, చౌటుప్పల్‌లో మాత్రం పూర్తిగా మహిళలే 150 మంది సభ్యులుగా ఉండడం విశేషం. వారిలో 21 మందితో కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలు వెన్‌రెడ్డి సంధ్య, ప్రధానకార్యదర్శి డాక్టర్ ఉజ్జిని మంజుల, కోశాధికారి పోలోజు శ్రీలత ఆధ్వర్యంలో ప్రతీ నెలరోజులకు ఒకసారి సభ్యులంతా సమావేశమై కార్యాచరణ రూపొందించుకుంటారు. విద్య, వైద్యం, ఆరోగ్యం, ఆహ్లాదం, కులవృత్తుల ప్రోత్సాహం, మహిళాసాధికారత వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మహాత్మా గాంధీతో అనుబంధం ఉన్న ప్రాంతాలను సందర్శిస్తారు. ఆ ప్రాంతాల్లోని జీవన స్థితిగతులను అధ్యయనం చేస్తారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సేవలు చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా సొంత నిధులు వెచ్చించి మహాత్ముడి పేరిట అభివృద్ధి పనులు చేపట్టాలని సంకల్పించారు. తమ కార్యక్రమాలు, కార్యాచరణతో మహిళల్లో ఉత్సాహం నింపుతున్నారు.

స్వాతంత్య్ర స్ఫూర్తి.. చైతన్య దీప్తి



'పల్లె సీమలే దేశానికి పట్టుగొమ్మలు' అన్న జాతిపిత మహాత్మాగాంధీ మాటలను కొన్ని గ్రామాలు నిజం చేస్తున్నాయి. పలు గ్రామాలు స్వాతంత్య్ర స్ఫూర్తితో చైతన్యవంతమై ప్రగతిపథాన పయనిస్తున్నాయి. గాంధీ మార్గంలో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని పాటిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాయి. మరికొన్ని జాతీయ జెండా ఔన్నత్యాన్ని కాపాడుతూ.. నిత్యం జాతీయ గీతాలాపన చేస్తూ ప్రజల్లో దేశభక్తిని పెంపొందిస్తున్నాయి. సంఘాలు, యువత దేశరక్షణలో, సమాజ సేవలో భాగస్వాములవుతున్నాయి. నేడు స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఆయా ప్రాంతాలపై ప్రత్యేక కథనాలు.

ఆడబిడ్డలకు అండగా..



చిట్యాలలో ఆడపిల్ల పుట్టినందుకు నగదును అందజేస్తున్న ఐదవ వార్డు కౌన్సిలర్ పూలమ్మ(ఫైల్)

చిట్యాల : ఆడపిల్లలకు అండగా నిలుస్తూ వారికి ఆర్థిక చేయూతనిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు పలువురు దాతలు. మున్సిపాలిటీ ఎన్నికల సమయంలో ఆడపిల్లల ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్నారు. చిట్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి ఆ వార్డు పరిధిలో వివాహం అయ్యే ప్రతి ఆడపిల్లకు రూ.10,116 అందజేస్తామని హామీనిచ్చారు. ఆ హామీ మేరకు ఆయన వైస్ చైర్మన్‌గా ఎన్నికైన నాటి నుంచి ఇప్పటి వరకు ఆ వార్డులో నివాసం ఉంటూ వివాహమైన 22 మంది యువతులకు నగదు అందజేశారు. చిట్యాల మున్సిపల్ ఐదో వార్డు కౌన్సిలర్ జడల పూలమ్మ, ఆమె భర్త చిట్యాల సింగిల్‌విండో డైరెక్టర్ చినమల్లయ్య తమ వార్డులో పుట్టే ప్రతి ఆడబిడ్డకు రూ.10,116 అందజేస్తున్నారు. ఈ నాలుగున్నరేళ్లలో పదహారు మంది ఆడబిడ్డలకు ఈ మొత్తం అందజేశారు.

గ్రామ కల్యాణలక్ష్మి..



గ్రామ కల్యాణలక్ష్మి అందజేస్తున్న మాజీ సర్పంచ్ కొండయ్య (ఫైల్)

పెద్దవూర : మండలంలోని బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నరాల కొండయ్య గ్రామ కల్యాణలక్ష్మి పథకం ప్రవేశపెట్టి గ్రామంలో ఆడపిల్లల వివాహానికి తనవంతుగా రూ.5,116 అందిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆయన ఉపాధ్యాయ వృత్తి చేపట్టి, ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెచ్ఎంగా, ఎంఈఓగా బాధ్యతలు నిర్వహించి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డులు సైతం అందుకున్నారు. ఆ తర్వాత పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా గెలుపొందారు. సర్పంచ్‌గా పదవి చేపట్టిన నాటి నుంచి ఇప్పటివరకు 25 మందికి గ్రామ కల్యాణలక్ష్మి పేరుతో రూ.5116 ఆర్థిక సాయం అందించారు.

39 ఏళ్లుగా మద్యానికి దూరంగా..




బండపాలెం గ్రామం వ్యూ

కోదాడరూరల్ : కోదాడ పట్టణానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న బండపాలెం గ్రామంలో 39 ఏళ్లుగా సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేస్తున్నారు. 39 ఏళ్ల కిందట దసరా పండుగ రోజున మద్యం తాగి ఇద్దరు వ్యక్తుల మధ్య గొడవ.. కుటుంబాల మధ్య పెద్ద ఘర్షణకు దారి తీసింది. దీంతో గ్రామంలో అశాంతి నెలకొంది. దాంతో నాడు గ్రామ పెద్దలు, ప్రజలు కలిసి గ్రామం బాగుండాలంటే ఊరిలో సారా, మద్యం అమ్మకూడదు, తాగకూడదని నిర్ణయించారు. నాటి నుంచి ఆ గ్రామంలో మద్యపాన నిషేధం కొనసాగుతోంది. ఆ కట్టుబాటుకు ఎవరైనా వ్యతిరేకంగా వెళ్తే రూ.5 వేల జరిమానా చెల్లించాలని అగ్రిమెంట్ రాసి అందరూ సంతకాలు చేశారు.

కొందరు అతిక్రమించినా...

గ్రామంలో ఇద్దరు ముగ్గురు వ్యక్తులు కట్టుబాటుకు వ్యతిరేకంగా బెల్టుషాపు తెరిచారు. స్థానికులు మందలించినా వినలేదు. నెల రోజుల వరకు ఎవరూ వారి వద్ద మద్యాన్ని కొనకపోవడంతో చేసేది లేక వారే స్వచ్ఛందంగా దుకాణాలు మూసి వేసుకున్నారు.

సాయి ఆలయంలో జాతీయ గీతాలాపన



చింతపల్లి : మండల కేంద్రంలోని షిర్డీ సాయినాథుడి దేవాలయంలో 10 సంవత్సరాల నుంచి ఉదయం 8 గంటలకు జాతీయ గీతాలాపన ఉంటుంది. చింతపల్లి మండల కేంద్రంలోని హైదరాబాద్ – నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారి పక్కనే ఉన్న సాయి దేవాలయంలో ఆలయ కమిటీ నిత్యం జాతీయ గీతాలాపన నిర్వహిస్తుండడంతో దేవాలయానికి వచ్చే భక్తులు ఓ పక్క ఆధ్యాత్మిక చింతనతో పాటు మరో పక్క దేశభక్తిని కూడా చాటుకుంటున్నారు.

భట్టుగూడెం నుంచి బార్డర్‌కు..



దేశ సేవలో భట్టుగూడెం ఆర్మీ జవాన్లు

చింతపల్లి : ఉమ్మడి జిల్లాలో మారుమూల గ్రామం. 400 జనాభా ఉన్న ఆ ఊరి నుంచి.. దేశసేవ చేయాలనే తపన వారిని దేశ సరిహద్దు వరకు నడిపించింది. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం వింజమూరు గ్రామపంచాయతీ పరిధిలోని భట్టుగూడెం గ్రామానికి చెందిన వి.రవికుమార్‌రాజు, దేవులపల్లి వెంకటేశ్వర రాజు, దూపాటి కేశవరాజు, తంగెళ్ల శివరాజు, సత్యనారాయణరాజు భారత ఆర్మీలో చేరి గ్రామానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. యువత ఆర్మీలో చేరేలా స్ఫూర్తినిస్తున్నారు.

వీర జవాన్ తంగెళ్ల శివరాజు

గ్రామానికి చెందిన తంగెళ్ల శివరాజు 2004లో ఆర్మీలో చేరాడు. దేశ సేవ చేయాలనే తపన కలిగిన శివరాజు యువత ఆర్మీలో చేరాలని ప్రోత్సహించేవాడు. శివరాజు 2006 ఏప్రిల్ 26న దేశ రాజధాని ఢిల్లీలో మిలటరీ వాహనం నడుపుతుండగా జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. గ్రామస్తులు ఆయన విగ్రహాన్ని గ్రామ ముఖ ద్వారం వద్ద ఏర్పాటు చేశారు. ఈ వీరజవాన్‌ను భట్టుగూడెం ప్రజలు స్మరించుకుంటూనే ఉన్నారు.

ఆర్మీలో చేరడం నా అదృష్టం



దేశసేవలో భాగం కావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. 1998లో విధుల్లో చేరిన నేను సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్)లో విధులు నిర్వహిస్తున్నాను. రాజస్థాన్‌లో శిక్షణ పూర్తి చేసుకొని ఛత్తీస్‌ఘఢ్, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల్లో విధులు నిర్వహించా. యువత దేశసేవలో భాగం కావడానికి ఆర్మీ చక్కటి వేదిక.

– వి.రవికుమార్ రాజు, జవాన్

కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న



ఆర్మీలో చేరి దేశసేవలో పాలుపంచుకోవడం నా జీవితంలోనే ఒక గొప్ప అనుభూతి. 1985లో ఆర్మీలో ఎన్‌రోల్‌మెంట్ అయ్యాను. కార్గిల్ వార్‌లో సైతం పాల్గొన్నాను. 2005లో ఆర్మీ నుంచి రిటైర్డ్ అయ్యాను. దేశ సేవ చేసేందుకు యువత ఆర్మీలో చేరాలి.

– దేవులపల్లి వెంకటేశ్వరరాజు, రిటైర్డ్ జవాన్, భట్టుగూడెం

సీఐఎస్ఎఫ్‌లో విధులు నిర్వహించా



దేశసేవ కోసం ఆర్మీలో చేరిన నేను సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్)లో విధులు నిర్వహించాను. జార్ఖండ్‌లోని బొకారా స్టీల్ సిటీలో శిక్షణ పొందిన నేను అసోం, విశాఖపట్నం, చెన్నై, హైదరాబాద్, వెస్ట్ బెంగాల్, కేరళ ప్రాంతాల్లో పని చేశాను. 2016లో ఆర్మీ నుంచి రిటైర్డ్ అయ్యాను.

– దుపాటి కేశవరాజు, రిటైర్డ్ జవాన్

శ్రీలంక యుద్ధంలో పాల్గొన్నా



1983లో శ్రీలంకలో జరిగిన యుద్ధంలో పాల్గొన్నాను. భారతదేశం మన దేశ ఆర్మీని అక్కడికి పంపడంతో విధి నిర్వహణ నిమిత్తం యుద్ధంలో కెప్టెన్‌గా శ్రీలంకకు వెళ్లి కొన్ని రోజుల పాటు అక్కడి యుద్ధంలో పాల్గొన్నాం. యువత ఆర్మీలో చేరి దేశసేవ చేయాలి.

– సత్యనారాయణ రాజు, రిటైర్డ్ ఆర్మీ కెప్టెన్

ఏడాదంతా మువ్వన్నెల రెపరెపలు



బేగంపేట గ్రామంలోని గాంధీ విగ్రహం వద్ద ఎగురుతున్న జాతీయ జెండా

రాజాపేట : యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని బేగంపేట గ్రామంలో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ఏడాది పొడువునా 365 రోజుల పాటు జాతీయ పతాకం ఎగురుతూనే ఉంటుంది. 1979లో గ్రామస్తుంతా కలిసి మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. నాటి నుంచి ఏటా ఆగస్టు 15 స్వాతంత్య్ర దినోత్సవం, జనవరి 26 గణతంత్య్ర దినోత్సవం, అక్టోబర్ 2 గాంధీ జయంతితోపాటు విజయదశమి (దసరా) పండుగ రోజున జాతీయ జెండాను మారుస్తూ నూతన జెండాను ఎగురవేస్తున్నారు. నాటి నుంచి నేటివరకు సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు మారినా ఈ ఆనవాయితీని కొనసాగిస్తూ ఉండడం విశేషం.

జనగళంలో జాతీయగీతం

- మూడున్నరేళ్లుగా రోజూ ఉదయం 8.30 గంటలకు గీతాలాపన

రామగిరి(నల్లగొండ): ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేందుకు నల్లగొండ పట్టణానికి చెందిన జనగణమన ఉత్సవ సమితి అహర్నిశలు కృషిచేస్తోంది. 2021 జనవరి 23న నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని నల్లగొండ పట్టణంలోని ప్రధాన కూడళ్లలో నిత్య జాతీయ గీతాలాపన కార్యక్రమాన్ని ప్రారంభించింది. నాటి నుంచి నేటి వరకు నిర్విరామంగా కార్యక్రమాన్ని కొనసాగిస్తూ జాతీయ గీతాలాపనలో ప్రజలను భాగస్వాములను చేస్తోంది. దీంట్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం 8.30 గంటలకు ప్రధాన కూడళ్లలో జాతీయ గీతాలాపన చేస్తున్నారు. దీనికోసం పట్టణంలోని ప్రధాన రహదారిలో మైక్‌లను బిగించారు. గీతాలాపన సమయంలో రోడ్లపై వెళ్తున్న పాదాచారులు, వాహనదారులు స్వీయ క్రమశిక్షణతో జాతీయ గీతం ఆలపిస్తూ దేశభక్తిని చాటుతున్నారు.

ప్రజల నుంచి అనూహ్య స్పందన

మొదటగా నల్లగొండ పట్టణంలో 12 కూడళ్లలో నిత్య గీతాలాపనకు శ్రీకారం చుట్టిన జనగణమన ఉత్సవ కమిటీ సభ్యులు.. ప్రజల నుంచి అనూహ్య స్పందన రావడంతో నల్లగొండ జిల్లాలో మరికొన్ని సెంటర్లకు విస్తరించారు. 2022 జనవరి 27న తిప్పర్తి మండల కేంద్రంలో, 2022 ఆగస్టు 15న నార్కట్‌పల్లి మండల కేంద్రంలో, ఆ తర్వాత పానగల్లు నిత్య జాతీయ గీతాలాపన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ఏడాది జనవరి 23వ తేదీన త్రిపురారం మండల కేంద్రంలో ప్రారంభించారు.



నల్లగొండలో జాతీయ గీతాలాపన చేస్తున్న పట్టణవాసులు

ఎనిమిది నెలల్లోనే పదేళ్ల అభివృద్ధి



భూదాన్‌పోచంపల్లిలో తాగునీటి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి తదితరులు

- ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : గత ప్రభుత్వం పదేళ్లలో చేయలేని అభివృద్ధిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎనిమిది నెలల్లోనే చేసి చూపించారని, రైతులకు ఇచ్చిన మాట ప్రకారం పంట రుణాలు కూడా మాఫీ చేశారని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. భూదాన్‌పోచంపల్లిలో అమృత్ 2.0 పథకం కింద రూ.17.50 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులు, జూలూరు ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి బుధవారం ఆయన ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమం కోసం పాటుపడుతుండగా, కొన్ని శక్తులు అసత్య ప్రచారం చేస్తున్నాయని, ప్రజలు నమ్మవద్దని సూచించారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేయడమే లక్ష్యంగా సీఎం ముందుకెళ్తున్నారని, రేవంత్‌రెడ్డి కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నారని గుర్తు చేశారు.

ఇంటింటికీ తాగునీరు : ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి నియోజకవర్గంలో ఇంటింటికీ పూర్తిస్థాయిలో తాగునీరు అందించేందుకు చర్యలు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అసంపూర్తిగా ఉన్న రహదారులు, వంతెనల పనులను కూడా ప్రారంభించినట్లు పేర్కొన్నారు. అనంతరం అధికారులతో సమావేశమై అభివృద్ధి పనులపై సమీక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మిశ్రీనివాస్, వైస్ చైర్మన్ బాత్క లింగస్వామి, మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డి, తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, పబ్లిక్‌హెల్త్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఈఈ మనోహర్, ఆర్ఐ వెంకట్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేశం, మండల, పట్టణ అధ్యక్షులు పాక మల్లేశ్ యాదవ్, భారత లవకుమార్, డీసీసీ ఉపాధ్యక్షులు కళ్లెం రాఘవరెడ్డి, సామ మధుసూధన్‌రెడ్డి, మర్రి నర్సింహారెడ్డి, గోరంటి శ్రీనివాస్‌రెడ్డి, మన్నె వెంకట్‌రెడ్డి, .రమేశ్‌గౌడ్, మోహన్‌రెడ్డి, బండారు ప్రకాశ్ రెడ్డి, పక్కీరు మల్లారెడ్డి, కాసుల అంజయ్య, కొట్టం కరుణాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి

సాక్షి,యాదాద్రి : చికున్ గున్యా, డెంగీ వంటి విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థుల ఆరోగ్యంపైనా శ్రద్ధ వహించాలని, వసతి గృహాలు, పాఠశాలలను విజిట్ చేయాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో సమావేశం అయ్యారు. అవసరమైన చోట మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, మెడికల్ కిట్‌లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఇంటింటి సర్వేలో బయటపడుతున్న జ్వరపీడితులకు తక్షణమే వైద్యసేవలు అందజేయాలని సూచించారు. అలాగే స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమంపై సమీక్షించారు.

మన ఆవిష్కరణలు భళా...

- ఇంటింటా ఇన్నోవేటర్‌లో సత్తాచాటిన జిల్లావాసులు
- రాష్ట్ర స్థాయికి పది ఎగ్జిబిట్‌లు ఎంపిక

భువనగిరిటౌన్ : ఇంటింటా ఇన్నోవేటర్-2024లో యాదాద్రి జిల్లా ఆవిష్కర్తలు సత్తా చాటారు. 34 మంది దరఖాస్తు చేసుకోగా 10 ఉత్తమ ఆవిష్కరణలు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. వీటిని గురువారం భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించే స్వాతంత్య్ర వేడుకల్లో ప్రదర్శించనున్నారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే ఎగ్జిబిట్‌లను పరిశీలించి ఆవిష్కర్తలకు అవార్డులు ప్రదానం చేయనున్నారు. అత్యధిక ఆవిష్కరణలు రాష్ట్రస్థాయికి ఎంపికైన జిల్లాలో యాదాద్రి భువనగిరి నాలుగో స్థానంలో నిలిచింది. హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి వరుసగా మూడు స్థానాల్లో నిలిచాయి. ఎంపికైన ఆవిష్కరణలను సెప్టెంబర్‌లో జరిగే రాష్ట్రస్థాయిలో పోటీల్లో ప్రదర్శించనున్నారు.





ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన పత్తి చేలో కలుపుతీసే యంత్రాలు

ద్విచక్ర వాహనం చోరీ

చౌటుప్పల్: పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లగా.. బుధవారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చౌటుప్పల్ సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామానికి చెందిన కందుల నరేష్ రెండు రోజుల క్రితం స్థానిక బస్టాండ్ సమీపంలో సర్వీస్ రోడ్డులో ఉన్న ముత్తూట్ ఫైనాన్స్ ముందు ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేశాడు. పని ముగించుకొని వచ్చేసరికి ద్విచక్ర వాహనం కన్పించలేదు. రెండు రోజుల పాటు ఎంత వెతికినా ద్విచక్ర వాహనం దొరక్కపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇద్దరికి తీవ్ర గాయాలు

రాజాపేట: వ్యవసాయ బావి వద్ద పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి ఇరువురికి తీవ్రగాయాలైన సంఘటన రాజాపేట మండలంలోని బొందుగుల గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తరిగొప్పుల కరుణాకర్, ఉప్పరి సిద్దులు స్థానిక రైతు మైలారం శ్రీనివాస్‌రెడ్డి వ్యవసాయ బావివద్ద బోరుబావి రిపేరు కోసం వెళ్లారు. ఈ తరుణంలో బోరు పైపు వెలికి తీస్తుండగా ప్రమాదవశాత్తు పైన ఉన్న విద్యుత్ తీగలకు తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యారు. తీవ్ర గాయాలైన తరిగొప్పుల కరుణాకర్‌ను భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా, సిద్దును హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు.

జాతీయ జెండా ఎగురవేద్దాం ఇలా..!

పెద్దవూర : 1947 ఆగస్టు 14వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత మన దేశానికి స్వాతంత్ర్యాన్ని ప్రకటించారు అప్పటి బ్రిటీష్ పాలకులు. 15వ తేదీన ఉదయం గవర్నర్ హౌజ్‌పై, 16వ తేదీ ఉదయం ఎర్రకోటపై మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. నాటి నుంచి దేశ ప్రజల గుండెల్లో జాతీయ స్ఫూర్తిని రగిలిస్తూనే ఉంది. స్వాతంత్ర్య ఉత్సవాల్లో భాగంగా హర్ ఘర్ తిరంగా పేరిట ప్రతి ఇంటా మువ్వన్నెల జెండాను ఎగరవేస్తున్నారు. భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను గురువారం నిర్వహించేందుకు దేశవ్యాప్తంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్లాస్టిక్ జెండాలను వాడరాదని.. కాగితపు జెండాలనే వాడాలని ఆదేశాలు సైతం జారీ అయ్యాయి.


జాతీయ జెండా

నిబంధనలు ఇలా..

- 2002లో మార్పు చేసిన నియామావళిని అనుసరించి జాతీయ పతాకం విషయంలో కొన్ని నిబంధనలు తప్పనిసరి
- సాధారణంగా జెండా రూపకల్పన దీర్ఘచతురస్రాకారంలో ఉంటుంది.
- జాతీయ జెండాలోని మూడు రంగులు సమాన వెడల్పు గల పట్టీలుగా ఉండాలి. పైపట్టీ కాషాయ వర్ణం, మధ్యలో తెలుపు, కింద ముదురు ఆకుపచ్చ రంగులు ఉండాలి.
- జెండా పొడవు, వెడల్పుల నిష్పత్తి 2:3గా ఉండాలి.
- తెలుపు పట్టీ మధ్యలో 24 ఆకులు గల నావికా నీలం రంగు గల ఆశోకచక్రం ఉండాలి.
- భారత జాతీయ పతాకాన్ని పాలిస్టర్, కాటన్, ఉన్ని, సిల్క్, ఖాదీతో తయారు చేసిన వస్త్రాన్ని మాత్రమే వాడాలి.
- జెండా ఎగురవేసినప్పుడు కాషాయ వర్ణం పైకి వచ్చేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలతో పాటు అన్ని విద్యాసంస్థలు అన్ని రోజుల్లో జాతీయ జెండాను ఎగురవేయవచ్చు.
- ఏదైనా సమావేశ స్థానంలో జెండా ప్రదర్శించాలనుకుంటే ప్రసంగకర్తకు కుడివైపు జెండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- జాతీయ జెండాకు సమానంగా గాని, ఇంకా ఎత్తులో గాని ఇతర ఏ జెండా ఎగురకూడదు.
- జాతీయ జెండా ఊరేగింపులో గాని, కవాతులో గాని ఇతర జెండాలతో కలిసి తీసుకు వెళ్లేటప్పుడు వాటికి ముందు మధ్యలో గాని, కుడి వైపుకు గాని ఉండేలా చూసుకోవాలి.
- జెండాను ఎగురవేసేటప్పుడు, దించే సమయంలో వ్యక్తులంతా జెండాకు అభిముఖంగా నిలబడాలి.
- జెండాను ఎగురవేసేటప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ నేలను తాకకూడదు. ఎగురవేసేటప్పుడు వేగంగాను, అవనతం చేసేటప్పుడు మెల్లగానూ దించాలి.
- ఉద్దేశ్యపూర్వకంగా జెండాను తలకిందులు చేయడం, నీరు తదితర ద్రవాల్లో ముంచటం వంటివి చేయడం నేరం.
- ఎగురవేయటానికి ముందు జెండాలో పువ్వులు తప్ప ఇతర వస్తువులను ఉంచడం, జెండా మీద రాయడం నిషిద్ధం.
- జాతీయ జెండాను టేబుల్ క్లాత్‌గా గాని, ప్లాట్‌ఫాం ముందుగాని వాడరాదు. విగ్రహాల మీద గాని, ఇతర వస్తువుల మీదగాని కప్పరాదు.
- దుస్తుల మీద, యూనిఫారాల్లో జాతీయ జెండాను వాడవచ్చు. అయితే నడుం కింది భాగంలో, లోదుస్తుల మీద వాడరాదు. జెండాను దిండు గలీబులమీద, చేతి రుమాళ్లమీద ఎంబ్రాయిడరీ చేయడం నిషిద్ధం.

100 అడుగుల ఎత్తులో జాతీయ జెండా

- నేడు కోదాడ, మిర్యాలగూడ పట్టణాల్లో ఆవిష్కరణ

కోదాడ: పట్టణంలోని రామిరెడ్డిపాలెం రోడ్డు పెద్దచెరువు సమీపంలో గురువారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇండియన్ వెటరన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వంద అడుగుల ఎత్తులో మొదటిసారిగా జాతీయ పతాకాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఆవిష్కరణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసిన అసోసియేషన్ సభ్యులు గురువారం ఎమ్మెల్యే పద్మావతి చేత జెండాను ఆవిష్కరించనున్నారు. దీనిని ప్రత్యేకంగా మహారాష్ట్రలోని పూణేలో తయారుచేయించి కోదాడకు తీసుకొచ్చారు. దీని ఏర్పాటు కోసం పట్టణంలోని పలువురు దాతలు ముందుకు రావడంతో వెటరన్ అసోసియేషన్ ముందుండి ఈ పనులను పూర్తి చేయించింది. ఈ కార్యక్రమంలో కోదాడ ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఇండియన్ వెటరన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్, స్టేట్ కోఆర్డినేటర్ మధుసూధనరావు కోరారు.


కోదాడ: ఆవిష్కరణకు సిద్ధమైన జెండా


మిర్యాలగూడ టౌన్: వంద అడుగుల జెండా

మిర్యాలగూడ పట్టణంలో..

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని ఎన్‌ఎస్‌పీ క్యాంపులోని రాజీవ్‌గాంధీ స్టేడియంలో మున్సిపల్ జనరల్ ఫండ్ రూ.17లక్షలతో ఏర్పాటు చేసిన వంద అడుగుల జాతీయ జెండాను స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా గురువారం స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆవిష్కరించనున్నారు. మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ అధ్యక్షతన జరగనున్న ఈ కార్యక్రమానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి తదితరులు హాజరుకానున్నారు.

ట్రాఫిక్ ఏఎస్‌ఐకి ఇండియన్ పోలీస్ మెడల్

- నేడు అందించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి


కాట్రగడ్డ శ్రీనివాస్, ఏఎస్‌ఐ

చౌటుప్పల్: చౌటుప్పల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న పట్టణ కేంద్రానికి చెందిన కాట్రగడ్డ శ్రీనివాస్ ఇండియన్ (ప్రెసిడెంట్) పోలీస్ మెడల్ అందుకోనున్నారు. హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో గురువారం జరిగే స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ మెడల్‌ను ప్రదానం చేయనున్నారు. 1989లో కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరిన శ్రీనివాస్ ఏఎస్‌ఐ స్థాయికి ఎదిగారు. ఇప్పటి వరకు ఆయన తన సర్వీసులో 30 వరకు రివార్డులు, ప్రశంసాపత్రాలు పొందారు. విధి నిర్వహణలో అందించిన అత్యుత్తమ సేవలనుగాను కేంద్ర హోంశాఖ విశిష్ట సేవ–2022 కింద ప్రతిష్టాత్మక ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపిక చేసింది. భువనగిరి, చౌటుప్పల్ డివిజన్లలోని పలు పోలీస్ స్టేషన్లలో కీలకమైన ఎస్‌బీ విభాగంలో కూడా ఆయన పనిచేశారు. తనకు ఇండియన్ పోలీస్ మెడల్ దక్కడం ఎంతో ఆనందంగా ఉందని, ఈ మెడల్ తన బాధ్యతను పెంచుతుందని శ్రీనివాస్ తెలిపారు.

నకిరేకల్‌లో ఆంధ్రా నాటుకోళ్లు

నకిరేకల్: పట్టణంలో గురువారం ముత్యాలమ్మ బోనాల పండుగ నిర్వహించనున్న నేపథ్యంలో బుధవారం ఆంధ్రా నాటుకోళ్లను పెద్దఎత్తున విక్రయించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతి జిల్లాకు వ్యాపారులు నకిరేకల్ పట్టణంలోని మూసీ రోడ్డులో చేపల మార్కెట్ వద్ద ట్రాలీ ఆటోలో నాటుకోళ్లను పెట్టి కేజీ రూ.300 చొప్పున విక్రయించారు. ఒక్కో కోడి పుంజు, గుడ్లు పెట్టే పెట్టలు కేజీన్నర నుంచి 2కేజీల వరకు బరువు కలిగి ఉన్నాయి. స్థానికంగా చికెన్ షాపుల్లో పోలిస్తే ధర తక్కువగా ఉండటంతో ఈ నాటుకోళ్లను పట్టణ ప్రజలు ఎగబడి మరీ కొనుగోలు చేశారు. బుధవారం ఒక్క రోజే నకిరేకల్ పట్టణంలో 500 నాటుకోళ్లను విక్రయించామని, రూ.4లక్షల పైన వ్యాపారం జరిగిందని వ్యాపారులు తెలిపారు.


నాటుకోళ్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు

నకిలీ సర్టిఫికెట్ల తయారీ రాకెట్ గుట్టురట్టు

- నిందితుల అరెస్టు, చర్లపల్లి జైలుకు తరలింపు

భువనగిరి క్రైం : నకిలీ ధ్రువీకరణ పత్రాలు తయారు చేసి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న ముఠా గుట్టు రట్టు చేశారు భువనగిరి పోలీసులు. నిందితుల్లో ఇద్దరు పట్టుబడగా మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. భువనగిరి పట్టణ సీఐ సురేష్‌కుమార్ బుధవారం వివరాలు వెల్లడించారు. ఇస్లాం మతంలోకి మారడం వల్ల ప్రయోజనాలు ఉంటాయని భువనగిరి పట్టణానికి చెందిన కొందరు వ్యక్తులు అమాయకులకు మాయమాటలు చెప్పి ఇస్లాం మతం స్వీకరించినట్లుగా వారి పేరుపై ధ్రువీకరణ పత్రాలు సృష్టిస్తున్నారు. ఆధార్, ఓటరు ఐడీ కార్డు, బర్త్ సర్టిఫికెట్, వాహన రిజిస్ట్రేషన్, టెన్త్, ఇంటర్, డిగ్రీ తదితర సర్టిఫికెట్‌లలో వారి పేర్లను మార్పిడి చేసి రూ.20వేల నుంచి రూ.50 వేలకు విక్రయిస్తున్నారు. భువనగిరికి చెందిన అబ్దుల్లా అలియాస్ సుందరి గణేష్, హైదరాబాద్‌కు నజీర్ అలియాస్ నర్సింగ్, ఢిల్లీకి చెందిన భరత్ గుప్తతో పాటు మరికుక్కల గిరి దందా నిర్వహిస్తుండగా పక్కా సమాచారంతో భువనగిరి పోలీసులు విచారణ చేపట్టారు. నిందితుల్లో అబ్దుల్లా, మరికుక్కల గిరిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి కంప్యూటర్లు, నకిలీ సర్టిఫికెట్లు, రబ్బర్ స్టాంపులు, గెజిట్ నోటిఫికేషన్ జిరాక్స్ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. వారిని కోర్టుకు రిమాండ్ చేసి అక్కడినుంచి చర్లపల్లి జైలుకు తరలించారు. నజీర్ అలియాస్ నర్సింగ్, భరత్ గుప్త పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. పోలీసులను భువనగిరి డీసీపీ రాజేశ్‌చంద్ర అభినందించారు.

భార్యను హత్య చేసిన భర్త


సరిత (ఫైల్)

సూర్యాపేటటౌన్: మద్యానికి బానిసైన భర్త క్షణికావేశంలో భార్య మెడకు వైరు చుట్టి హత్య చేశాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు గ్రామానికి చెందిన దాసోజు బ్రహ్మచారి, సరిత(31) భార్యాభర్తలు. వీరు ప్రేమించుకుని 2014లో కులాంతర వివాహం చేసుకున్నారు. గత కొద్దిరోజులుగా సూర్యాపేట పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నారు. బ్రహ్మచారి డోర్ పాలిష్ వర్క్ చేస్తుండగా.. సరిత ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తోంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. బ్రహ్మచారి కొంతకాలంగా మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవ పడుతున్నాడు. బుధవారం ఉదయం బ్రహ్మచారి తన భార్యతో గొడవపడి ఆవేశంతో ఇంట్లో ఉన్న వైరును ఆమె మెడకు చుట్టి బలంగా లాగడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. బ్రహ్మచారి వెంటనే సరిత కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి, ఆమెను సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లి అక్కడ నుంచి వెళ్లిపోయాడు. డాక్టర్లు మృతదేహాన్ని పరిశీలించి మెడకు వైరు చుట్టడంతోనే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతురాలి తల్లి దాసరి రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సూర్యాపేట పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు.

పొంగిపొర్లుతున్న ఏపూరు ఆనకట్ట

సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం గుండ్లసింగారం శివారులో పాలేరు వాగుపై ఉన్న ఏపూరు ఆనకట్ట బుధవారం పొంగి ప్రవహిస్తోంది. ఆనకట్ట పొంగిపొర్లడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆనకట్ట అందాలను చూడటానికి ప్రజలు తరలివస్తున్నారు.
– నూతనకల్



ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి


గురవయ్య (ఫైల్)

చిలుకూరు: వంట గ్యాస్ లీకై మంటలు చెలరేగి తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. చిలుకూరు మండలం కొండాపురం గ్రామానికి చెందిన మేరిగ గురువయ్య(45) ఇంట్లో ఈ నెల 7వ తేదీన వంట చేస్తున్న క్రమంలో గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో గురవయ్య, ఆయన కుమారుడు, కోడలికి తీవ్ర గాయాలయ్యాయి. గురవయ్య హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చిక్సిత పొందుతూ బుధవారం మృతి చెందినట్లు అతడి బంధువులు తెలిపారు.

పురుగుల మందు తాగి..

పెన్‌పహాడ్: అప్పుల బాధతో పురుగుల మందు తాగిన గ్రామ పంచాయతీ కార్మికుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఎస్‌ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పెన్‌పహాడ్ మండలం ధర్మారం గ్రామానికి చెందిన నెమ్మాది వెంకన్న (50) గ్రామ పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల తన ఆరోగ్యం బాగోలేక కుటుంబ పోషణకు అప్పులు చేసి మనస్తాపానికి గురై ఈ నెల 7వ తేదీన గ్రామ శివారులో పురుగుల మందు తాగి ఇంటికి వచ్చి స్పృహ కోల్పోయాడు. కుటుంబ సభ్యులు గమనించి సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుమారుడు నెమ్మాది వంశీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాదం ఆకుపై స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు



బాదం ఆకుపై శ్రీను వేసిన చిత్రం

భువనగిరి: పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ టీచర్ శ్రీను బాదం ఆకుపై 78వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ చిత్రం గీశారు. ఈ చిత్రంలో 33 జిల్లాలతో కూడిన తెలంగాణ రాష్ట్ర పటంతో జాతీయ జెండాను పొందుపర్చారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ గంధ్ర శ్రీకాంత్ ఆయనను అభినందించారు.

దేశభక్తి చాటుకున్న దివ్యాంగులు


హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న దివ్యాంగులు

చౌటుప్పల్: స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా బుధవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ చేపట్టారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి తంగడపల్లి చౌరస్తా వరకు విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై ఈ ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో దివ్యాంగులు పాల్గొని దేశభక్తి చాటుకున్నారు. వీల్‌చైర్లలో కూర్చొని చేతిలో జాతీయ జెండాలను పట్టుకొని భారత్ మాతాజీ జై అంటూ నినాదాలు చేసుకుంటూ ర్యాలీ పాల్గొన్నారు.